నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, గురువారం 22 ఆగస్టు 2024 | MAHABUBABAD

పెద్దవంగరలో ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రైతులంటే ఇంత చిన్నచూపా?

- వెంటనే అందరికీ రుణమాఫీ చేయాలి
- పూర్తిస్థాయిలో కాలేదని మంత్రులే అంటుంటే రేవంత్‌రెడ్డికి సిగ్గులేదు
- కేసీఆర్ ప్రభుత్వంలో పుష్కలంగా నీళ్లు, కరెంట్.. ఆనందంలో రైతులు
- పెద్దవంగర వద్ద ధర్నాలో మాజీ మంత్రి ఎర్రబెల్లి

పెద్దవంగర, ఆగస్టు 21: మూడు విడతల్లో రాష్ట్రంలో 40శాతం మందికే రుణమాఫీ జరిగిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం పట్టదని.. రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతాడని అన్నారు. రూ. 49వేల కోట్లని చెప్పి.. 17కోట్లతో సరిపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదని అధికార కాంగ్రెస్ మంత్రులే అంటుంటే రేవంత్ రెడ్డికి సిగ్గులేదన్నారు. ఆయనకు అన్ని దేవుళ్ల మీద ఒట్లు తప్ప.. ప్రజల సంక్షేమం పట్టదని పేర్కొన్నారు. హరీశ్‌రావు సవాల్ భయంతోనే రుణమాఫీ మొదలు పెట్టారన్నారు. ఖమ్మం సభలో పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగిందనడం రేవంత్ రెడ్డి తెలివితక్కువతనానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటిమాటికి మాట మార్చి రైతులను మోసం చేస్తోందని అన్నారు. రుణమాఫీ మీద సరైన అవగాహన లేని ఈ మంత్రులు తలో మాట మాట్లాడుతున్నారని, నిన్నటికి నిన్న ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రూ.7వేల కోట్లు మాత్రమే రైతు రుణమాఫీ జరిగిందని, ఇంకా పదివేల కోట్లు జరగాల్సింది ఉందని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రుణమాఫీ కాక ఆందోళనలో ఉన్న లక్షలాది మంది రైతులకు అండగా ఉంటామన్నారు. ఆరు గాలం కష్టపడి పండించిన రైతు పట్ల ఈ ప్రభుత్వం చిన్నచూపు చూస్తూనే ఉందని, కేసీఆర్ హయాంలో రైతులు ఆనందంగా ఉన్నారని చెప్పారు. పాలకుర్తి నియోజకవర్గంలో పంటలు పండించుకునేందుకు రైతులకు కనీసం సాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని, వెంటనే పూర్తిగా రుణమాఫీ చేసి, అలాగే రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

1900 రైతుల్లో 800మందికే రుణమాఫీ

ధర్నాలో పాల్గొన్న రైతులతో కలిసి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్థానికంగా ఉన్న ఎస్‌బీఐకి వెళ్లి అక్కడి అధికారులను రుణమాఫీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెద్దవంగర బ్యాంకులో మొత్తం 1900 మంది రైతులు రుణాలు తీసుకుంటే 800 మందికే మాఫీ అయిందని రూ. 25 కోట్లకు రూ.9 కోట్లే మాఫీ అయ్యాయని తెలిపారు. 40 శాతానికి మించి రైతులకు రుణమాఫీ కాలేదని, పైగా డబ్బులు అన్ని బ్యాంకు ఖాతాల్లో పడి ఉన్నాయని చెప్పడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని ఎర్రబెల్లి పేర్కొన్నారు. ప్రతి ఒక్క రైతుకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని, రైతులు, ప్రజలు ఏ ఒక్కరూ అధైర్యపడొద్దన్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్ పాల్గొన్నారు.

రుణమాఫీ విషయంలో రైతన్నలకు బీఆర్ఎస్ అండగా నిలిచింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆంక్షలు లేకుండా ప్రభుత్వం అందరికీ మాఫీ చేయాలనే డిమాండ్‌తో నేడు(గురువారం) మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలకు సిద్ధమవుతున్నది. ఈమేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నాయకులు, శ్రేణులు నిరసనలకు సమాయత్తమయ్యారు. ఇచ్చిన హామీ మేరకు రుణాలు మాఫీ చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతూ రేవంత్ సర్కారు వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టనున్నారు. కాగా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసేవరకూ బీఆర్ఎస్ పార్టీ ఊరుకునేది లేదని, నేడు అన్ని చోట్ల ధర్నాలు, నిరసన కార్యక్రమాలకు రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రులు, జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. హనుమకొండలో ఏకశిల పార్కు వద్ద, మహబూబాబాద్ తహసీల్దార్ ఆఫీస్ ఎదుట, జనగామలోని ఆర్టీసీ చౌరస్తా, భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్‌లో, ములుగు జిల్లా కేంద్రంలో, పరకాల అంబేద్కర్ సెంటర్‌లో, నర్సంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు ఉంటాయని వారు తెలిపారు.

అమీనాబాద్ సొసైటీ భవనం

కొర్రీలతో 588 మందికి మొండిచేయి

- అమీనాబాద్ సొసైటీలో వింత పరిస్థితి
- రేషన్ కార్డు లేదంటూ రుణమాఫీ ఆపిన వైనం
- ఆగమాగమవుతున్న అన్నదాతలు

నర్సంపేట, ఆగస్టు 21: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్నట్లు గొప్పగా ప్రచారం చేసుకున్నా, ఆచరణలో అమలు కావడం లేదు. ఇందుకు ఉదాహరణగా వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నిలుస్తుంది. ఈ సొసైటీ పరిధిలో ఖాదర్‌పేట, లింగగిరి, అమీనాబాద్‌తో పలు గిరిజన తండాలుంటాయి. సొసైటీలోని 1404 మంది రైతులను అర్హులుగా గుర్తించి రూ. 9.46 కోట్ల రుణమాఫీకి జాబితాను సిద్ధం చేశారు. అయితే మూడు విడతల్లో కలిపి కేవలం 816 మందికి మాత్రమే మాఫీ వర్తించగా, మిగిలిన 588 మందికి రుణమాఫీ కాలేదు. మొదటి విడుతలో 484 మందికి రూ. 2.20 కోట్లు, రెండో విడుతలో 185 మందికి రూ.1.30 కోట్లు, మూడో విడుతలో 147 మందికి రూ.1.20 కోట్లు మాఫీ వచ్చినట్లు సొసైటీ ప్రకటించింది. దీంతో అధికారుల కొర్రీలతో మాఫీకి దూరమైన 588 మంది రైతులు బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతూ ఆగమాగమవుతున్నారు. అక్కడ కూడా వారికి కచ్చితమైన సమాచారం ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కాగా, కొందరు రైతులు అమీనాబాద్‌తో పాటు చెన్నారావుపేట సొసైటీలోనూ సభ్యులుగా ఉంటూ రుణాలు పొందారు. అయితే ఈ రెండు సొసైటీల్లో కూడా వారికి రుణమాఫీ కాలేదు. దీంతో తమకు షరతులు లేకుండా రుణమాఫీ చేసే వరకు ఆందోళన చేస్తామని అన్నదాతలు హెచ్చరిస్తున్నారు.

రెండు సొసైటీల్లో మాఫీ కాలె..

నాకు అమీనాబాద్ సొసైటీలో రూ. లక్ష, చెన్నారావుపేటలో రూ. 1.40 లక్షల లోన్ ఉంది. ఈ రెండింటిలో ఏ ఒక్క సొసైటీలోనూ నాకు రుణమాఫీ జరగలేదు. 2022లో సొసైటీలో అప్పుతీసుకొని ఏటా వడ్డీ డబ్బులు చెల్లిస్తూ వస్తున్నాను. అయితే రుణమాఫీ జాబితాలో నా పేరు రాకపోవడంతో వ్యవసాయాధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నాను. అయినా వారి నుంచి సరైన సమాచారం రావడం లేదు. వెంటనే రుణమాఫీ చేయాలని కోరుతున్నా వారు పట్టించుకోవడం లేదు. రుణమాఫీ అయ్యేలా చూడాలని అధికారులను కోరాం. తిరిగి కొత్త రుణం ఇస్తే పంటల సాగుకు ఉపయోగించుకుంటాను.

– బుర్రి మల్లయ్య, రైతు, అమీనాబాద్

రేషన్ కార్డు లేదని మాఫీ ఆపారు

నాకు చెన్నారావుపేటలోని ఎస్‌బీఐలో రూ.1.50 లక్షల అప్పు ఉంది. నా కుటుంబానికి రేషన్‌కార్డు లేకపోవడంతో రుణమాఫీని నిలిపివేశారు. ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంతో ఆశగా ఎదురుచూశాను. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీకి ఎక్కువ డబ్బులు అవుతున్నాయనే కారణంతో ప్రభుత్వం కొర్రీలు పెడుతున్నది. లేనిపోని నిబంధనలు పెట్టి రైతులకు కోత పెడుతున్నది. దీని వల్ల చాలా మంది అర్హులైన రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. ఇప్పటికైనా మిగిలిన రైతుల పరిస్థితిని ప్రభుత్వం ఆలోచించి రుణమాఫీని వర్తింపజేయాలి. అందు కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కుండె కుమార్, రైతు, అమీనాబాద్

ములుగు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

రుణమాఫీ నిబంధనలను ఎత్తివేయాలి

ములుగు కలెక్టరేట్ వద్ద రైతు సంఘం నాయకుల ధర్నా

ములుగురూరల్, ఆగస్టు 21 : రుణమాఫీపై నిబంధనలను ఎత్తివేయాలని బుధవారం రైతు సంఘం నాయకులు ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎండీ గఫూర్ పాషా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల వరకు రైతులందరి రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు నిబంధనల పేరుతో దగా చేస్తున్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 40 శాతం మాత్రమే మాఫీ చేశారని, ఇంకా 60 శాతం మాఫీ జరగాల్సి ఉందన్నారు. నిబంధనలు ఎత్తివేసి ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షలు మాఫీ చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈమేరకు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సారయ్య, యా కూబ్, రామస్వామి, రాజు, ప్రవీణ్, రవి, స్వామిరావు, రఘుపతిరెడ్డి, దేవేందర్, శంకర్, సదయ్య, సీతారాంనాయక్, సారమ్మ, సమ్మక్క, అన్నయ్య, సారయ్య పాల్గొన్నారు.

రెన్యువల్ కోసం బారులు.. తోపులాట

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట ఎస్‌బీఐ వద్ద బారులు తీరిన రైతులు

నర్సింహులపేటలో ఘటన

నర్సింహులపేట, ఆగస్టు 21 : ప్రభుత్వం అర్భాటంగా చేసిన రుణమాఫీ రైతుల పాలిట శాపంగా మారింది. తప్పుల తడకగా రైతుల ఆధార్ కార్డు నంబర్లు మరో రైతులకు నమోదు కావడంతో పాటు ఒక రైతు ఖాతా నంబర్‌కు వివిధ జిల్లాలకు చెందిన రైతుల పేర్లు చూపించడంతో అన్నదాత పరేషాన్ అవుతున్నాడు. ఆడిట్ పేరుతో 20రోజులుగా రైతుల ఖాతాలో జమైన రుణమాఫీ డబ్బులు రెన్యువల్ చేసుకునేందుకు బ్యాంకు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో బుధవారం వివిధ గ్రామాల రైతులు పెద్ద ఎత్తున రావడంతో తోపులాట జరిగింది. దీంతో పోలీసులు బ్యాంకులో రైతులకు క్యూ ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బ్యాంకు అధికారి మాత్రం ఫొటోలు తీస్తే మీకు రుణమాఫీ పైసలు మరింత అలస్యం చేస్తామని బెదిరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తోపులాటలో కిందపడ్డా

రుణమాఫీ లిస్టులో నా పేరు వచ్చినట్లు ఇరవై రోజుల కింద అధికారులు చెప్పారు. పైసల కోసం బ్యాంకుకు పోతే 20 తారీకు తర్వాత రమ్మన్నారు. ఇవ్వాల బ్యాంకుకు పోతే చాలా మంది రావడంతో లైన్ల నిలబడమని చెప్పారు. పొద్దున 9 గంటలకు వస్తే 1 గంట వరకు లైన్ల నిలబడిన. ఒక్కసారిగా తోపులాట జరగడంతో కుర్చీల మీద పడి నడుముకు దెబ్బ తగిలింది. ఇంత ఇబ్బంది పెట్టి రుణమాఫీ చేస్తే ఏం లాభం. ఇప్పటి దాక రైతు బంధు లేకపోయే. రుణమాఫీ పైసలు ఇవ్వకపోయే.

– గుగులోత్ లచ్చు, రైతు, బస్తారాంతండా

మంత్రి ఉత్తమ్ సార్ చెప్పిండని లోన్ కట్టిన

కేసముద్రం, ఆగస్టు 21 : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సార్ చెప్పిండని రూ.2 లక్షల కంటే ఎక్కువగా ఉన్న రుణాన్ని బ్యాంక్‌లో చెల్లించాను. నా పేరుపై రూ. 1,67,650, నా భార్య సులోచన పేరు మీద రూ.75,929, మొత్తం రూ. 2, 43, 579 అప్పు ఉంది. రూ. 2 లక్షల కంటే ఎక్కువగా అప్పు ఉంటే, రూ.2 లక్షలు ప్రభుత్వం ఇస్తుందని, మిగతాది బ్యాంక్‌కు చెల్లించాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపాడు. దీంతో నేను రూ.48 వేలను బ్యాంక్‌లో చెల్లించి మేనేజర్‌ను అడుగగా మాకు ప్రభుత్వం నుంచి డబ్బులు రాలేదని చెప్పాడు. వ్యవసాయ అధికారిని అడుగగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్నాడు.

– కొల్లూరి శ్రీను, రైతు, కేసముద్రం విలేజ్, మహబూబాబాద్ జిల్లా

దేవరుప్పుల : పలు సాంకేతిక కారణాలతో దేవరుప్పుల మండలంలో 120 మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో బుధవారం ఇలా రైతువేదికకు వచ్చి ఇన్‌చార్జ్ ఏఈవో సంతోష్‌కు ఫిర్యాదు చేశారు.

మల్కాపూర్‌లో రైతుల ఆందోళన

- ఎమ్మెల్యే కడియం హామీ ఇచ్చినా మాఫీ కాలేదని ఆవేదన

చిల్పూరు, ఆగస్టు 21 : తమకు రుణమాఫీ కాలేదని జనగామ జిల్లా చిల్పూర్ మండల కేంద్రంలోని మల్కాపూర్ ఇండియన్ బ్యాంకులో రైతులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఇండియన్ బ్యాంకు, చిన్నపెండ్యాల ఎస్‌బీఐలో కలిపి 4,925 మంది రుణాలు తీసుకోగా 3,105 మందికి రుణమాఫీ కాగా 1820 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని తెలిపారు. రుణమాఫీ కాలేదని జూలై 26న మల్కాపూర్‌లోని ఇండియన్ బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తుండగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వచ్చి హామీ ఇచ్చారని అన్నారు. అయినప్పటికీ ఇప్పటి వరకు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నామని, రుణమాఫీ మాత్రం కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

మాఫీ లేదు.. భరోసా లేదు..

- రైతులకు రేవంత్ సర్కారు ద్రోహం
- రుణమాఫీలో అనేక కొర్రీలు
- నేడు జిల్లా, మండల స్థాయిలో నిరసన కార్యక్రమాలు
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 21 : అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలను ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ద్రోహం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం మహబూబాబాద్‌లోని ఎమ్మెల్సీ క్యాంప్ ఆఫీస్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు రుణమాఫీలో అనేక లోపాల వల్ల చాలా మందికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఏ గ్రామంలో చూసినా రుణమాఫీ కాని రైతులే ఎక్కువ ఉన్నారని, వారు ప్రతి రోజూ బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరిగినా సమస్యలను మాత్రం ప్రభుత్వం పరిష్కరించడం లేదన్నారు. వరంగల్, మరిపెడలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ పార్టీ ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇప్పుడు మాత్రం రుణమాఫీకి అనేక కొర్రీలు పెట్టి రైతులకు మూడు విడతల్లో మాఫీ చేసి కొంతమందికి మాత్రమే చేసి కాంగ్రెస్ పార్టీ రైతులకు అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సార్లు రుణమాఫీ పైన మాట మార్చుతూ వచ్చిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం లక్ష లోపు 36లక్షల మందికి రుణమాఫీ చేస్తే, కాంగ్రెస్ పార్టీ రెండు లక్షల రుణమాఫీ అని మోసం చేసి కేవలం 22లక్షల మందికి రుణమాఫీ చేసిందని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారిని మభ్య పెడుతూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని, ఆయన పాలనపైన ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు ఎకరాకు 10 వేలే ఇస్తుందని, రైతు భరోసా పెట్టి ఎకరానికి 15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. రైతు భరోసా విధివిధానాల అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలకు మాత్రం రైతు రుణమాఫీ అవుతుందని, రాష్ట్రంలో ఉన్న నిరుపేద రైతులకు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేయలేదన్నారు. రైతులకు రేషన్, ఆధార్ కార్డు సరిగా లేదని, ఒకే కుటుంబం అని అనేక రకాలు తప్పులను చూపి రుణాలను మాఫీ చేయలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను, మేధావులను ఇబ్బంది పెట్టే భాష వాడడం సరి కాదని, వెంటనే తన భాషను మార్చుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి దళిత, గిరిజన, మైనార్టీ ప్రజలు ఓట్లు వేసి రేవంత్‌రెడ్డిని సీఎం చేస్తే వారి సమస్యలను పరిష్కరించకుండా ఇబ్బంది పెట్టడం సరి కాదన్నారు. ఉద్యమం చేసి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ గత 10 సంవత్సరాల కాలంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రతి నిరుపేదకు న్యాయం చేశారన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో ఒక స్వర్ణయుగంగా కొనసాగిందని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని, చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ వదిలి పెట్టే ప్రసక్తే లేదని, అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణ మాఫీ చేయాలని నేడు జిల్లా, నియోజకవర్గం, మండలస్థాయి, గ్రామ స్థాయిలో అన్ని చోట్ల ధర్నాలు, నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు.

వీధి కుక్కల వీరంగం

- ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలు
- వేర్వేరు చోట్ల ఘటనలు

కుక్కల దాడిలో బాలుడి చేతికి గాయాలైన దృశ్యం

శాయంపేటలో గాయాలను చూపిస్తున్న తల్లిదండ్రులు

గంధంపల్లిలో గాయపడిన చిన్నారి సుఫియాన్

శాయంపేట/బయ్యారం/సంగెం, ఆగస్టు 21: కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులతో పాటు మరో ఇద్దరికీ గాయాలయ్యాయి. శాయంపేటకు చెందిన వంగరి రాజు–విజయ దంపతుల ఐదేళ్ల కుమారుడు శివసాయి బాలికల హైస్కూల్ ఎదుట పిల్లలతో కలిసి రోడ్డుపై ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో కుక్కలు శివసాయిపై దాడి చేయగా, ఎడమ చేయికి గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం మధ్యాహ్నం వేళ అవే కుక్కలు పాఠశాలలో పనిచేస్తున్న అటెండర్‌పై దాడి చేశాయి. అదేవిధంగా బయ్యారం మండలం గంధంపల్లిలో షేక్ యూసఫ్–రిజ్వరా దంపతుల మూడేండ్ల చిన్నారి సుఫియాన్‌కు తల్లి ఇంటి ముందు అన్నం తినిపిస్తోంది. ఈ క్రమంలో వీధి కుక్క ఒక్కసారిగా వచ్చి చిన్నారి మీద పడి గొంతు పట్టేసింది. దీంతో తల్లి కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న బాలుడి తండ్రి యూసఫ్ వచ్చి కుక్క నుంచి కొడుకును కాపాడాడు. ఈ క్రమంలోనే యూసఫ్ కాలు పట్టి కుక్క గాయం చేసింది. చిన్నారికి తీవ్ర గాయం కావడంతో రాత్రికి రాత్రే మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడే చికిత్స పొందుతున్నాడు. సంగెం మండలం రాంచంద్రాపురం గ్రామానికి చెందిన వేల్పుల అనిల్ కుమారుడు విలోహిత్ 3వ తరగతి చదువుతున్నాడు. సాయంత్రం తన సోదరితో కలిసి వస్తుండగా వీధి కుక్కలు విలోహిత్‌పై దాడి చేయడంతో కాలుకు, ఛాతి భాగంలో గాయాలయ్యాయి. చికిత్స కోసం ఎంజీఎం దవాఖానకు తరలించారు.

వైద్యులు లేక రోగుల పాట్లు

- ఇంజెక్షన్లు, మందుల కోసం పోటాపోటీ
- గూడూరు సీహెచ్‌సీలో ఇదీ పరిస్థితి

గూడూరు దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు

సూదులు, మందుల కోసం వేచి చూస్తున్న రోగులు

గూడూరు, ఆగస్టు 21 : మహబూబాబాద్ జిల్లా గూడూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) జ్వరపీడితులు, రోగులతో కిటకిటలాడుతున్నది. నిత్యం వందలాది మంది రోగులు దవాఖానకు జ్వరాలతో వస్తుండగా దవాఖానలో సరిపడా బెడ్లులేక ఇబ్బందులు పడుతున్నారు. 30 పడకల దవాఖానగా ఉన్నా అందుకు సరిపడా వైద్యులు లేక, పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదు. ఓపీ చూసిన తర్వాత ఇంజెక్షన్లు, మందులు తీసుకునేందుకు పై అంతస్థులో ఉన్న ఇన్‌పేషంట్ వార్డుకు వెళ్లాల్సి వస్తున్నదని రోగులు ఆవేదనతో చెబుతున్నారు. అక్కడ గుంపులు గుంపులుగా ఇంజెక్షన్లు, మందుల కోసం రోగులు ఎగబడుతున్నారు. కొన్నిసార్లు కావాల్సిన మందులు దొరకక బయట కొనాల్సి వస్తున్నది. బెడ్స్ లేక ఒక్కోసారి బెడ్‌కు ఇద్దరు, ముగ్గురు చొప్పున చికిత్స తీసుకోవాల్సి వస్తున్నదని పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని, తగు వైద్య యంత్ర సామగ్రిని అందుబాటులో ఉంచాలని వారు కోరుతున్నారు.

జస్టిస్ ఫర్ అభయ..

- కేఎంసీ వద్ద కొవ్వొత్తులతో నివాళి
- ఘటనను వివరిస్తూ ముగ్గులతో నిరసన

కోల్‌కతా జీఆర్‌కార్ హాస్పిటల్ పీజీ వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనపై రోజురోజుకూ నిరసనలు తీవ్రమవుతున్నాయి. బుధవారం కేఎంసీ వద్ద కళాశాల విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు, వైద్యులు 'జస్టిస్ ఫర్ అభయ' డిమాండ్‌తో భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా దాడులను వ్యతిరేకిస్తూ రోడ్లపై ముగ్గులు వేసి బాధితురాలు అనుభవించిన బాధను వివరిస్తూ ఫ్లాష్ మాబ్ చేశారు. అలాగే మద్దతుదారుల చేతిముద్రలు సేకరించి ప్రదర్శించడంతో పాటు కళాశాల ప్రధాన ద్వారం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించి, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

- వరంగల్ చౌరస్తా, ఆగస్టు 21